తెలుగు కళా సమితి (న్యూ జెర్సీ)

చిన్న కథల పోటీలో బహుమతి గెలుచుకున్న రచన

# చలివేంద్రం

"దుర్గయ్యా గుంజలు బాగా లోతుగా పాతించు. పందిరి బలంగా వుండాలి. గాలి వస్తే పడిపోయేటట్లు వుండకూడదు మరి నీ ఇష్టం" పనివాళ్ళ పనితనాన్ని పర్యవేక్షిస్తూ హెచ్చరించారు వర్ధనమ్మగారు.

"అలాగేనండమ్మా! పందిరి గట్టిగా వుండేటట్లే వేయిస్తాగా" భరోసా ఇచ్చాడు దుర్గయ్య.

గుంజలు నాలుగు పాతెయ్యడం, వాటిని కలుపుతూ బొంగులు బిగించి కట్టడం, తాటి ఆకులు ఒకటికి రెండు జోడించి అమర్చటం వెంటవెంటనే జరిగిపోయాయి.

ఇద్దరు కుర్రవాళ్లు పైకి ఎక్కి పైకప్పు పూర్తి చేశారు. ఒక అరడజను గడ్డి మోపులు పరచి గాలికి ఎగిరిపోకుండా పురికొసతో బొంగుల్ని కలిపి కట్టివేశారు.

అసలే మండు వేసవి. గ్రీష్మ తాపం తట్టుకోవడం ఏ తరం వారి తరం కావడం లేదు. కొత్తగా తయారైన పందిరిలో చల్లగా, హాయిగా వున్నది.

వర్ధనమ్మగారితో సహా పనివాళ్ళందరూ చల్లని పందిరి క్రింద నిల్చొని కాసేపు ఊరట చెందారు. నేలమీద పడిన చెత్తా చెదారం ఏరి శుభ్రం చేశారు.

తన కోరిక మేరకు నిర్మింపబడిన పందిరిని చూసుకుని సంబరపడి పోయారు వర్ధనమ్మగారు.

మిగిలిన ఏర్పాట్లు సిద్ధం చేసుకునేందుగ్గాను ఇంటివైపు నడక సాగించిం దావిడగారు. నడి వయసులోనే వైధవ్యం పొందిన వర్ధనమ్మ అనేక పుణ్య స్థలాల్ని దర్శించింది. తరచుగా ఆ వూరి రామాలయంలో జరిగే భజన కార్యక్రమాల్లో పాల్గొనటం, అభిషేకాలు, అర్చనలు. వగైరాలు జరిపించటం. సదరు కార్యక్రమాలకు విరివిగా చందాలు సమర్పించడం వర్ధనమ్మగారి అభిరుచులు.

భారత రామాయణాది గ్రంథాల్ని కూలంకషంగా చదివింది. భగవద్గీతను పారాయణం చేసింది.

ప్రతి రోజు విష్ణు సహస్ర నామాలు, లలితా సహస్ర నామాలు చదువుకోనిదే తన దైనందిన కార్యక్రమాలు చేపట్టదు వర్ధనమ్మగారు.

ఆధ్యాత్మిక చింతనకే ఎక్కువ సమయం కేటాయించే వర్ధనమ్మగారికి చాలా కాలంగా ఓ చిరు కోరిక మిగిలిపోయింది. తన కోరికను కొడుకు, కోడలికి తెలియజేసింది. ఆమెను సమాధాన పరచటానికి విఫల యత్నం చేసిన ఆ ఇద్దరూ, వర్ధనమ్మగారి మనసు నొప్పించటం ఇష్టం లేక అంగీకరించారు.

వర్ధనమ్మగారి నేతృత్వంలో వెలసింది 'చలివేంద్రం' పదిమందికి మంచి నీటిని, అందులోనూ వేసవి కాలంలో అందించటం,

తద్వారా పుణ్యాన్ని, మోక్షాన్ని కూడా పొందవచ్చుననే నమ్మకం అవిడనందుకు ప్రోత్సహించినై.

ఓ నాలుగు పెద్ద పెద్ద బానలు, ఓ అరడజను గ్లాసులు, రెండు జగ్గులు, వగైరా సామాగ్రినంతా తెప్పించారు. నేల మీద ఇసుక పోసి బానల్ని వరుసగా అమర్చారు. తను కూర్చోవటానికి ఓ కుర్చీ, ఎండలో అలసిపోయి వచ్చినవారు కూర్చునేందుగ్గాను ఇంటి దగ్గర వున్న ఓ పాత బల్ల తెప్పించి చలివేంద్రంలో వేయించారు వర్ధనమ్మగారు.

ఏర్పాట్లన్నీ పూర్తి అయ్యాయన్న సంతోషం ఆమె వదనంలో స్పష్టంగా కనిపించింది. చలివేంద్రాన్నంతా మరోసారి పరికించి చూసుకుని తృప్తిగా నవ్వుకున్నారామె.

చలివేంద్రంలో తను సమకూర్చిన సదుపాయా లన్నింటి గూరించి వర్ధనమ్మగారు వివరంగా చెప్తుంటే వింటూ భోజన కార్యక్రమం మొదలు పెట్టాడు కొడుకు.

తెల్లవారి కుళాయిలు రాగానే మంచి నీటిని చలివేంద్రానికి తరలించే కార్యక్రమం గురించిన ఆలోచనలో మునిగిపోయింది వర్ధనమ్మగారు.

"అన్నట్లు మర్చేపోయాను...." అంటూ కోడలి దగ్గరగా వచ్చింది వర్ధనమ్మగారు.

"రేపట్నించి మన పంపుదగ్గర ఎవ్వర్నీ ఒక్క బిందె కూడా నీళ్ళు పట్టుకు వెళ్ళనీయవద్దు. అన్నీ గలివేంద్రానికే పంపేయాలి."

"ఇంట్లోకి, చలివేంద్రానికి సరిపోగా ఇంకా బయట వాళ్ళక్కూడా ఎక్కడ సరిపోతాయ్?" అంటూ రాగాలు తీసిన వర్ధనమ్మగారి వైపు అయోమయంగా చూశారు కొడుకు-కోడలు. ○

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 7-7-89